క్లుప్తంగా

27న జగనన్నకు చెబుదాం

పెదకాకాని: ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలన్నారు. మీ ప్రాంతాలలో ఎటువంటి సమస్యలు ఉన్నా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీ అందజేసినట్లయితే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

నడింపాలెం క్లాప్ మిత్రకు సత్కారం



నడింపాలెం (ప్రత్తిపాడు): నడింపాలెం గ్రామ పంచాయతీ క్లాప్ మిత్ర పి.మస్తానమ్మ రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి సత్కారాన్ని అందుకున్నారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా సఫాయ్ మిత్ర, క్లాప్ మిత్రలను రాష్ట్రస్థాయిలో సన్మానించారు. అందులో భాగంగా నడింపాలెం క్లాప్‌మిత్ర పి.మస్తానమ్మను పంచాయతీరాజ్ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు దుశ్శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నడింపాలెం సర్పంచ్ లాం. రత్న కుమార్, పంచాయతీ సెక్రటరీ ఖాజా, స్వచ్ఛ భారత్ ఎమ్మార్సీ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

వంగిపురం (ప్రత్తిపాడు): వివాహితను లైంగికంగా వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన ఆవల రాజ్యలక్ష్మిని అదే గ్రామానికి చెందిన ఆలపాటి శివశంకర్ గత రెండు సంవత్సరాలుగా వెంటపడి వేధిస్తున్నాడు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, ఎక్కడ పడితే అక్కడ తాకడం, కొట్టడం, సైగలు చేయడం, బూతులు తిట్టడం వంటి వెకిలి చేష్టలకు పాల్పడుతూ మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గ్రామంలో జరుగుతున్న గణేష్ విగ్రహ ఊరేగింపు సమయంలో చెరువు కట్ట సమీపంలో రాజ్యలక్ష్మి పట్ల మరోమారు శివశంకర్ అందరూ చూస్తుండగానే అసభ్యంగా ప్రవర్తించాడు. చేయి పట్టుకొని బలవంతం చేయడంతో పాటు, రాకపోతే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీవీఐటీలో మామా మశ్చీంద్ర చిత్రబృందం సందడి



పెదకాకాని: సుధీర్‌బాబు, ఈషా రెబ్బా మృనాళిని, రవి ప్రధాన పాత్రలలో శ్రీ వెంకటేశ్వరా మూవీస్ ఎల్ఎల్‌పీ పతాకంపై నటుడు హర్షవర్ధన్ రచన, దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం మామా మశ్చీంద్ర. ఈ చిత్రం అక్టోబర్ 6 న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా సోమవారం చిత్ర బృందం మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హీరో సుధీర్‌బాబు మాట్లాడుతూ వైవిధ్యంతో కూడిన కథతో ఈ చిత్రం ఆసక్తి రేపుతుందనీ, చిత్రంలో మూడు విభిన్నమైన పాత్రలలో తాను త్రిపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన టీజర్ చిత్రంపై ఆసక్తి పెంచిందన్నారు. విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో, డైరెక్టర్ హర్షవర్ధన్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్లో పిల్లల వివాదం.. తల్లిదండ్రుల కొట్లాట

ప్రత్తిపాడు: పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం.. ఇంటి దగ్గర తల్లిదండ్రులు, బంధువులు కొట్లాడుకునే వరకు తీసుకెళ్లిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన తోడేటి నాగరాజు కుమారుడు రాఘవేంద్రరావు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. స్కూల్లో పిల్లలు ఆడుకునే సమయంలో అదే పాఠశాలకు చెందిన జ్ఞానేశ్వర్ అనే విద్యార్థి రాఘవేంద్రరావుని కొట్టాడు. ఆ విషయమై రాఘవేంద్ర తల్లిదండ్రులు నాగరాజు, శిలువకుమారిలు జ్ఞానేశ్వర్‌ని అడుగుతున్న సమయంలో జ్ఞానేశ్వర్ బంధువులకు రాఘవేంద్ర తల్లిదండ్రులకు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో జ్ఞానేశ్వర్ బంధువులు వారిపై దాడి చేశారు. కర్రలతో ఇష్టమొచ్చినట్లు కొట్టి గాయపరచడంతో పాటు అసభ్యంగా బూతులు తిట్టారు. ఈ మేరకు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్ర బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విఘ్నాలను తీర్చే దేవుడు విఘ్నేశ్వరుడు

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను సన్మానిస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: విఘ్నాలను తీర్చే దేవుడు విఘ్నేశ్వరుడని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. సోమవారం నగర శివారులోని గోరంట్ల గ్రామంలో విఘ్నేశ్వర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీని గోళ్ళ శివశంకర్, గోళ్ళ బాలుయాదవ్, విగ్రహ కమిటీ సభ్యులు సన్మానించారు.

వెళ్లి రావయ్యా.. ఓ బొజ్జ గణపయ్య

ప్రత్తిపాడు: గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఒక వైపు వైభవంగా జరుగుతుండగా.. మరో వైపు నిమజ్జన జాతరలు హోరెత్తుతున్నాయి. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై ఏడు రాత్రులు ముగియడంతో సోమవారం పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ప్రత్తిపాడులోని యాదవ బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడిని మేళతాళాలు, సంప్రదాయ నృత్యాలు, డప్పుల వాయిద్యాల నడుమ గంగ ఒడికి ఘనంగా తరలించారు.



ప్రత్తిపాడులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



సంప్రదాయ నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు

అవయవ దానానికి కృషి చేయండి

- గుంటూరు జీజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్
- విజ్ఞాన్‌లో ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలు

చేబ్రోలు: విద్యార్థులు అవయవదానంపై అందరికీ అవగాహన కల్పించడానికి కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ఫార్మసిస్ట్ డే వేడుకలను '' ఫార్మసిస్ట్స్ స్ట్రెంగ్తనింగ్ హెల్త్ సిస్టమ్స్ అంగదాన్ మహాదాన్'' అనే ఇతివృత్తంతో నిర్వహించాలని ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫార్మసిస్ట్స్ పిలుపునిచ్చింది. చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలో అవయవ దానం గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీతో పాటు కంటి శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వై.కిరణ్ కుమార్ మాట్లాడుతూ లివర్, కిడ్నీ వంటి అవయవాల దకోసం చాలా మంది రోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఫార్మసీ రంగంలోని విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టిసారించి, కొత్తగా పుట్టుకొస్తున్న రోగాలకు సరికొత్త మందులను కనుగొనాలన్నారు. వైద్య, ఔషధ రంగాలలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదన్నారు. రోగుల భద్రతను కాపాడటంలో ఫార్మసిస్టుల కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్



చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు

అవయవదానంపై అవగాహన

ప్రత్తిపాడు: అవయవదానం మహాదానమని డాక్టర్ ఉమాసుందరి అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని పెరుమాళ్లు ఫార్మసీ కళాశాలలో నేచురల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేమరోపతి సౌజన్యంతో రోగ్ ముక్త్ భారత్‌పై సోమవారం సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన త్రిగుణ నేచర్ క్యూర్ డాక్టర్ ఉమాసుందరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవయవదానం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు తీసుకుంటున్న ఆహారం, జీవనశైలిలో వస్తున్న మార్పులపై అవగాహన కలిగించారు. ప్రకృతి వైద్యంలో మానసిక శ్రేయస్సుపై పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. మనకు కావలసిన ఎన్నో రకాల వస్తువులను కృత్రిమంగా తయారు చేసుకోగలమని, కానీ అవయవాల్ని తయారు చేసుకోలేమన్నారు. అందుచేత మరణించిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరొకరికి పునర్జన్మను ఇవ్వవచ్చని సూచించారు. మరణించిన ఒక వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఎనిమిది మందికి పునర్జన్మను ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. సెమినార్‌లో విజయవాడ ఎంఎస్ఆర్ ఆరోగ్యాలయ పరిశోధనాధికారి డాక్టర్ జ్ఞానదీప్, కళాశాల చైర్మన్ పెరుమాళ్లు, డైరెక్టర్ డి.శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్ఓడీ జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు ఉమాసుందరి, జ్ఞానదీప్ తదితరులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

ఔషధాల తయారీ వినియోగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

గుంటూరు రూరల్: ఔషధాల తయారీలో, వినియోగంలో ఫార్మసిస్టుల పాత్ర ముఖ్యమైందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం నగర శివారులోని లాం కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, జన ఔషధి, ఐఎస్‌పీఓఆర్ ఇండియా, అమరావతి చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసీ ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తుంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు రోగుల భద్రత, శ్రేయస్సులో అవిశ్రాంతంగా పనిచేస్తారన్నారు. ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని రూపొందించటంలో వారి పాత్ర ఎనలేనిదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్ ఆంకాలజీ డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టుల సహకారాన్ని గుర్తించి వారిని గౌరవించేందుకు ఈ రోజు వరల్డ్ ఫార్మసిస్ట్ డే జరుపుకుంటామని అన్నారు. కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత ఆంజనేయులు, సెక్రటరీ సుజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

బీపీ మండల్ మహాసేన రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు రిజర్వేషన్ కోటా కేటాయించకపోవటం దుర్మార్గమని బీపీ మండల్ మహాసేన రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నందున్న బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. బీసీలకు న్యాయం చేసే వరకూ న్యాయ పోరాటం చేస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. రోడ్డుపై బైఠాయించి ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ సంక్షేమ సంఘం విభజన రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీ అని చెప్పుకుని బీసీల ఓట్లతో గద్దెనెక్కిన మోదీకి తగిన గుణపాఠం రానున్న ఎన్నికల్లో చెప్పటం జరుగుతుందన్నారు. సీనియర్ న్యాయవాది కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం బీసీ కులగణన ఎందుకు చేపట్టడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ సిఫారసులు అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాజు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు దాసరి శివకుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, సమాజ్‌వాజ్ పార్టీ నేత శ్రీనివాస్, శాఖమూరి శివ, బి కోటేశ్వరరావు, డాక్టర్ బి కోటేశ్వరరావు, సాంబశివరావు, సింధు, శశి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

వట్టిచెరుకూరు ఎంఈవో–2 నిర్మల

ప్రత్తిపాడు: ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు బాల బాలికలు కృషి చేయాలని వట్టిచెరుకూరు ఎంఈవో–2 నిర్మల అన్నారు. మండల విద్యావనరుల కార్యాలయంలో సోమవారం పారా సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో–2 మాట్లాడుతూ ప్రతి దేశం 2030 నాటికి సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాల్లో ఐరాస సూచించిన పదిహేడు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లోని చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆకలిని అంతమొందించడం, ఆరోగ్యం–శ్రేయస్సు, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మంచినీరు, పారిశుద్ధ్యం వంటి పదిహేడు అంశాలపై ప్రజలకు వివరిస్తామన్నారు. పారా సంస్థ రాష్ట్ర సలహాదారు, ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాల్లో 280 హైస్కూల్స్, తెలంగాణలోని ఐదు జిల్లాల్లో 200 హైస్కూల్స్‌లో బాలల హక్కుల కోసం ప్రత్యేకంగా క్లబ్‌లు ఏర్పాటు చేసి బాలల హక్కులు, వారికున్న బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 600 గ్రామాల్లో బాలలకు ఎదురయ్యే సమస్యల నుంచి ఎలా బయటపడాలో చైతన్య పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు.



చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులతో ఎంఈవో–2 నిర్మల, హెచ్ఎం రమాదేవి తదితరులు

పొన్నూరు అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

పొన్నూరు: పొన్నూరు అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, ధూళిపాళ్ల నరేంద్ర గతంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర హయాంలో పొన్నూరులో అభివృద్ధి లేదన్నారు. తమ ఉనికిని చాటుకునేందుకు రోడ్ల వెంట చేస్తున్న రిలే నిరాహార దీక్షలను చూసి ప్రజలు నవ్వుతున్నారని విమర్శించారు. క్రిస్టియన్ ఏబీసీ అధ్యక్షులు మల్లెల రాజు మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు భవన యజమానులు సంతోషంగా అంగీకరించారని అన్నారు. ఇంటిలో కొంత భాగం నష్టపోయిన వారికి ఇంటి మరమ్మతులకు పరిహారం అందించారని అన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రోశయ్య ఇచ్చిన హామీ మేరకు టీడీఆర్ బాండ్లు అందించారని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రంగారావు అంజుమన్ ప్రెసిడెంట్ షేక్. మామ, నాయకులు అనిత, షర్మిల, కె. శ్రీనివాసరావు, గేరా సంజీవ్, రఘునందనరావు, నాగసూరి ప్రతాప్, వీరయ్య, సర్పంచులు యానాదిరావు, సుబ్బారావు పాల్గొన్నారు.


యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

చేబ్రోలు: విద్యారంగ వికాసం ఉపాధ్యాయ సంక్షేమం కోసం ఎన్నో స్వతంత్ర ఉద్యమాల్ని, ఐక్య ఉద్యమాలను చేసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు అన్నారు. చేబ్రోలులోని యూటీఎఫ్ కార్యాలయం ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం స్వర్ణోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీన విజయవాడ కానూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ సభ జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యానారాయణ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, తెలకపల్లి రవి వంటి ప్రముఖులు హాజరు కానున్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, కరోనా సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఘన చరిత్ర కలిగిన సంఘ స్వర్ణోత్సవ కార్యక్రమాలలో చేబ్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వై.రమేష్‌బాబు, డి.నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సహదేవుడు, మహ్మద్ ఈసా, సైదా, చాయనాథవర్మ తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుని లడ్డూ అ'ధర'హో



నిమజ్జనానికి తరలుతున్న గారపాడు గణనాథుడు



ప్రత్తిపాడులో పూజలందుకుంటున్న లంబోదరుడు

ప్రత్తిపాడు: గణేష్ నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన గణనాథులు భక్తుల నుండి విశేష పూజలందుకుంటున్నారు. వినాయకుని లడ్డూలను వేలంపాటల్లో దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడుతున్నారు. లక్షలు, వేలు వెచ్చించి లడ్డూలను చేజిక్కించుకుంటున్నారు. వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో స్థానిక బొడ్డురాయి సెంటరు వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవం కన్నుల పండువగా జరిగింది. నిర్వాహకులు లడ్డూకు వేలం నిర్వహించగా చెర్లోపల్లి వెంకటేశ్వర్లు రూ.1,77,000 లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాల మధ్య నిమజ్జనానికి తరలించారు. ప్రత్తిపాడులో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతుండగా, కోయవారిపాలెంలో కొలువుదీరిన వినాయకుడు విశేష పూజలందుకుంటున్నాడు.

స్కూల్ 'గేమ్స్' సెలక్షన్స్

- నేడు, రేపు నియోజకవర్గ స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు
- ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో సత్తా చాటనున్న క్రీడాకారులు



ఈ నెల 16న జరిగిన మండల స్థాయి పోటీల్లో కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ పోటీల్లో రెండవ ఘట్టంకు సమయం ఆసన్నమయ్యింది. పాఠశాల స్థాయిలో క్రీడాకారులు తమ సత్తా చాటనున్నారు. గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో వివిధ క్రీడాకారుల ఎంపికలు జరగనున్న సంగతి తెలిసిందే. మండల స్థాయిలో ఎంపికలు పూర్తి కాగా, నేడు, రేపు నియోజకవర్గ స్థాయి ఎంపికలు జరగనున్నాయి. ఇందుకు నియోజకవర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది.

రెండు విభాగాల్లో పోటీలు..

నియోజకవర్గ స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. బాలుర విభాగం, బాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. ఇప్పటికే మండల స్థాయిలో ఎంపికైన సుమారు 300 మంది క్రీడాకారులు, నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయిలో జరిగే ఎంపికలకు పంపిస్తారు.

గేమ్స్‌లో జరగనున్న పోటీలివే..

ఆటల పోటీల్లో కబడ్డీ, ఖో ఖో, వాలిబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నికాయిట్, షటిల్ బాడ్మింటన్, యోగ

అథ్లెటిక్స్‌లో జరగనున్న పోటీలివే..

అథ్లెటిక్స్‌లో రన్నింగ్, త్రోస్, జంప్స్ పోటీలు జరగనున్నాయి. రన్నింగ్‌లో 100, 200, 400, 600, 800 లాంగ్ రన్‌లో 1500, 3000 మీటర్ల పోటీలు త్రోస్‌లో షాట్‌పుట్, డిస్కస్, జావెలిన్ జంప్స్‌లో లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ పోటీలు జరగనున్నాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి ..



ఈ నెల 26, 27 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ సెలక్షన్లు జరగనున్నాయి. అన్ని మండలాల్లో ఇప్పటికే మండల స్థాయి సెలక్షన్లు జరిగాయి. అక్కడ ఎంపికైన క్రీడాకారులు ప్రత్తిపాడులో జరిగే నియోజకవర్గస్థాయి సెలక్షన్లలో పాల్గొంటారు. మొత్తం తొమ్మిది రకాల క్రీడల్లో ఎంపికలు జరగనున్నాయి. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉల్లాసకరమైన వాతావరణంలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటవచ్చు.

పి.డేవిడ్ రాజ్‌కుమార్, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయిన నలుగురు విద్యార్థులు



షేక్ తాహెరున్నీసా, ఎం షారోన్‌బాయి (ఉప్పలపాడు)



యు హారిక (తక్కెళ్ళపాడు)



యూసుఫ్ అలీ (తక్కెళ్ళపాడు)

పెదకాకాని: హ్యాండ్ బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్ బ్యాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీఈటీ చంద్ర వినయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 29, 30, అక్టోబరు 1 మూడు రోజుల పాటు తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో 13 జిల్లాల నుంచి (ఉమ్మడి జిల్లాలు) అండర్ 17 బాలికలు, అండర్ 17 బాలుర విభాగంలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ఉమ్మడి గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అండర్ 17 బాలికల జట్టుకు పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జెడ్పీహైస్కూల్ నుంచి షేక్ తాహెరున్నీసా, ఎం.షారోన్‌బాయి, తక్కెళ్ళపాడు జెడ్పీహైస్కూల్ నుంచి యు.హారిక, అండర్ 17 బాలుర జట్టుకు షేక్ యూసుఫ్‌అలీలు ఎంపికయ్యారన్నారు. వీరు మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనపరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. తెనాలిలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను నవంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వినయ్‌కుమార్ వివరించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

హోటల్స్‌పై విజిలెన్స్ అధికారుల దాడులు

12 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

గుంటూరు రూరల్: హోటల్స్‌పై గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో అధికారులు సోమవారం దాడులు చేసిన ఘటన చోటు చేసుకుంది. పలు హోటళ్లపై దాడులు చేసి 12 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య అవసరాల నిమిత్తం సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వాడుతున్న హోటళ్లపై దాడులు చేసి 12 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. గోరంట్ల ప్రాంతంలోని బిలాల్ బిర్యానీ హోటల్, శశి టిఫిన్ అండ్ మీల్స్ హోటల్, అమరావతి హోటల్, వేద స్వీట్స్ అండ్ బేకరి, వాణిజ్య కేంద్రాల్లో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, అధికారులు పాల్గొన్నారు.



సిలిండర్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఉప్పలపాడులో ప్రభాతభేరి ర్యాలీ



పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం నా మట్టి, నా దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పాఠశాల హెచ్ఎం ఎం నాగేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభాతభేరి కార్యక్రమం జరిగింది. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో గ్రామంలో నా మట్టి నా దేశం అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రమ్స్ మోగిస్తూ, జాతీయ జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.